# ఈ జీవితం మీదే కాదు మాది కూడా...

**జీవితం ఆడించినట్లల్లా ఆడే బొమ్మ కాదు. పిల్లల కోసం గానుగెద్దులా పనిచేసిన వారికి కూడా ఎప్పుడో ఒకప్పుడు స్వతంత్రంగా జీవించాలనిపిస్తుంది. అప్పుడు జీవితం ప్రాణమున్న బొమ్మే అవుతుంది**

ప్రియ ఫోనులో చెప్పిన విషయం విని నేను నిజంగానే ఆశ్చర్యపోయేను. న్యూయార్కు నుండి తాను ఫోను చేసి చెబితేగాని హైదరాబాదులోనే ఉంటున్న సుజాత విషయం నాకు తెలియలేదంటే నాకు కొంచెం సిగ్గుగానే అనిపించింది. సుజాతది, నాదీ ఒకే ఊరు. ఇద్దరం కలిసి చదువుకున్నాం. మా ఇద్దరి మధ్యా మంచి స్నేహం ఉంది. నేను మా ఇంట్లో నాలుగవ సంతానాన్ని. సుజాత మూడవది. ఆమె తర్వాత మరో ఇద్దరు మగపిల్లలున్నారు.

ఇంతమంది సంతానం ఉండడం వల్ల ఈ రోజుల్లోలా పిల్లల గురించి విపరీతమైన శ్రద్ధ తీసుకునే అవకాశం మా తల్లితండ్రులకు లేదు. స్నానం చేయించి, ఇంత వండి పెట్టి, జడలేసి, వీధి బడికి తోలేసేవారు. సరిగ్గా చదవకపోతే ఓపిగ్గా చెప్పి హోమ్ వర్కులు చేయించే వెసులుబాటు వారికి లేదు. రెండు తగల్నివ్వడమే. అయినా, మేం అప్పటి రోజుల్లో, అంటే ఆడపిల్లలకు చదువులెందుకనే పరిస్థితుల్లోనే గ్రాడ్యుయేషన్ చేసేం. ఇంటి పనులతో పాటు ఎంబ్రాయిడరీ, వీణ నేర్చుకున్నాం. ఉద్యోగాల్లో చేరాం. నాకు సెక్రటేరియట్‌లో వచ్చింది. చింత చచ్చినా పులుపు చావని మావయ్యలు ఆడపిల్లకు ఉద్యోగమేంటని మా అమ్మని నిలేసినా, ఆర్థిక పరిస్థితులు అవగతమవుతున్న మా నాన్నగారు మౌనం వహించేరు. మౌనం అర్ధాంగీకారం కాదు, సంపూర్ణాంగీకారమని గ్రహించేను నేను. ఆ తర్వాత నాన్నగారు కుదిర్చిన సంబంధం చేసుకున్నాను. ఆయన కూడా అదే సెక్రటేరియట్‌లో సెక్షనాఫీసరుగా పని చేయడంతో మాకెలాంటి ఇబ్బందులూ ఎదురవలేదు.

సుజాత కూడా హైదరాబాదే చేరింది. ఆయన ఇరిగేషన్‌లో ఇంజనీరు. సుజాత మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంటులో సీనియర్ అసిస్టెంటు. తరచు కలుస్తుండేవాళ్ళం. సుజాత భర్త శ్రీనివాసరావుగారు కూడా కలుపుగోలు మనిషి. సెలవు రోజున వాళ్ళిద్దరూ మా ఇంటికి రావడమో, మేము వెళ్ళడమో జరిగేది. సుజాతకు ముగ్గురు పిల్లలు. ప్రియ అందరిలోనూ పెద్దది. తర్వాత సిద్ధార్థ. చివరిది వాసవి. మాకు ఇద్దరబ్బాయిలే.

జీవనయానంలో ఎన్ని ఒడిదుకులెదురైనా, ఎన్ని ఒత్తిళ్ళకు గురైనా మేం స్నేహానుబంధాన్ని చంపుకోలేదు. మా పెద్దవాడు అజయ్ ఇంజనీరింగ్ చేసి అమెరికా వెళ్ళిపోయేడు. చిన్నవాడు విజయ్ జర్నలిజం చేసి ఒక వారపత్రికలో ఈ మధ్యనే జాయినయ్యేడు. మావారు ఒక మంత్రిగారి దగ్గర ప్రయివేట్ సెక్రటరీగా ఉంటున్నారు.

సుజాతకు సూపర్నెంటుగా ప్రమోషన్ వచ్చింది. శ్రీనివాసరావుగారు ఇ.ఇగా పనిచేస్తున్నారు. సుజాత పిల్లల్ని బహు జాగ్రత్తగా చాలా శ్రద్ధ తీసుకుని పెంచింది. తానలా అపురూపం చేయడం నాకంతగా నచ్చేది కాదు.

వాళ్ళ హోమ్ వర్కులు చేయడం దగ్గర్నుంచి ప్రతిదానిలో సుజాత విపరీతంగా కలగజేసుకునేది. ప్రియకు కొన్నాళ్ళు డాన్సు నేర్పించింది. తానే స్వయంగా వాళ్ళని ట్యూషన్‌కి తీసుకెళ్ళేది. పరీక్షలయితే సరేసరి. సెలవు పెట్టి దగ్గరుండి రాయించి ఆటోలో ఇంటికి తీసుకొచ్చేది. పిల్లలు పుట్టేక సరిగ్గా చెప్పాలంటే సుజాతకు వాళ్ళ బాగోగులు తప్ప మరో జీవితమే లేనట్లు ప్రవర్తించేది. శ్రీనివాసరావుగారూ అంతే. సాయంత్రం వాళ్ళకు ఆటలు నేర్పించడం, పొద్దుటే జాగింగ్‌కు తీసుకెళ్ళడం.

"పిల్లల్ని వీళ్ళే కన్నట్లు అతి చేస్తున్నారు" అన్నానోసారి మావారితో విసుగ్గా.

ఆయన నవ్వి, "నీకు ఓపిక లేక వదిలేస్తే అందరూ అలా చేస్తారా" అన్నారు.

"ఓపిక లేకపోవడం కాదు. నడిచేవాళ్ళని ఎత్తుకు తిప్పడం తప్పు కాదా. వాళ్ళని కొంత వాళ్ళ స్వేచ్ఛకు వదిలేయాలి కాని" అన్నాను.

మావారింక రెట్టించలేదు.

సుజాత పడిన శ్రమ మాత్రం ఊరికే పోలేదు.

ప్రియ ఇంజనీరింగ్ పూర్తిచేసి ఎమ్.ఎస్ చేయడానికి అమెరికా వెళ్ళిపోయింది. అక్కడే మరో ఇంజనీరుని పెళ్ళిచేసుకుని ఉన్నత స్థాయిలో ఉంది.

> "ఈ వయసులో ఒక అనాథ పాపని పెంచడం వాళ్ళకేమాత్రం ఇష్టం లేదు."
>
> ✵
>
> "పాపని పెంచడానికి మాకు వయసయిపోయింది. రిటైర్‌మెంటు తీసుకోవడానికి మాత్రం వయసు అయిపోలేదు."

సిద్ధార్థ డాక్టరు చేసేడు. అతను కూడా స్టేట్స్ చేరుకున్నాడు. కోడల్ని కూడా డాక్టర్నే తెచ్చుకుంది సుజాత.

వాసవి మాత్రం గ్రూప్ వన్ పరీక్షలు రాసి ఆర్.డి.ఓగా సెలక్టయింది. ఆమె వివాహం ఒక అయ్యేయస్ ఆఫీసర్‌తో జరిగింది. వాసవి ప్రస్తుతం సెలవు మీద భర్తతో ఢిల్లీలో ఉంటున్నది.

మా పెద్దాడి పెళ్ళి ఈ మధ్యనే చేసేం. వాళ్ళిద్దరూ అమెరికా వెళ్ళిపోయేరు. పెళ్ళిలో కాస్సేపు కనబడింది సుజాత. తర్వాత కలవడానికే కుదరలేదు.

ప్రియ ఫోను చెయ్యడంతో సుజాత గురించి ఆలోచనలు తేనెటీగల్లా ముసిరేయి.

వెంటనే సుజాతకు ఫోన్ చేసి ప్రియ చెప్పిన సంగతి నిజమేనా అని అడుగుదామనుకున్నాను. కానీ, అంతకంటే ఒకసారి వెళ్ళి అసలు ప్రియ చెప్పినదాంట్లో ఎంతవరకు నిజముందో తెలుసుకుందామనుకుని ఓపిక పట్టాను.

ఆ రాత్రి సిద్ధార్థ నుండి ఫోనొచ్చింది.

"ఆంటీ, తెలుసా అమ్మ చేసిన పని?"

"ప్రియ చెప్పింది."

"అసలిదేంటి ఈ వయసులో!"

"నిజమే, నేను కనుక్కుంటాను" అన్నాను.

"కనుక్కోవడం కాదు, గట్టిగా మందలించండి."

అతని గొంతులో కోపం తారస్థాయిలో మోగుతోంది.

ఎలక్షన్ సందడిలో మావారు జోరుగా మంత్రిగారితో కలిసి తిరుగుతున్నారు.

ఆయన ఇంటికి రాగానే అంతా చెప్పి, సుజాత ఇంటికి వెళ్ళి స్వయంగా చూడాలన్నది నా ప్లాను.

ఇంతలో వాసవి నుండి రానే వచ్చింది ఫోను.

నాకర్థమైంది ఒకటే. ఎవరికీ సుజాత చేసిన పని బొత్తిగా నచ్చలేదని. నిజం చెప్పొద్దూ, నాక్కూడా అయిష్టంగానే ఉంది మనసులో.

సుజాత స్వభావం నాకు బాగా తెలుసు. పిల్లలంటే ఆమెకు ఎనలేని ప్రేమ. ఆమె ఇలా చేస్తుందంటే నాకు పూర్తిగా నమ్మశక్యంగా లేదు. సుజాత వాళ్ళు వనస్థలిపురంలో ఇల్లు కట్టుకున్నారు. మేము కుకట్‌పల్లిలో కొనుక్కున్నాం. రెండూ నగరానికి రెండు కొసలు. వెళ్ళి రావడమంటే మాటలు కాదు.

ఆ సాయంత్రం మా పుణ్యం పుచ్చి మా వారు అనుకోకుండా ఇంటికొచ్చేరు. మర్నాడు మళ్ళీ రాయలసీమ వెళ్ళిపోవాలట.

ఆయన లోపలకి రాగానే నేను ఆత్రతగా ఎదురెళ్ళి, "మనం అర్జెంటుగా సుజాతావాళ్ళింటికి వెళ్ళాలి" అన్నాను.

ఆయన నన్నో పిచ్చిదానిలా చూశారు.

"ఇప్పుడా? ఏమైంది వాళ్ళకి" అన్నారు.

"అదంతా తర్వాత చెబుతాను. ముందయితే

బయల్దేరండి" అన్నాను.

"నేను చాలా రిటైరైపోయేను జయా. మళ్ళీ రేపు రాత్రికి వెళ్ళిపోవాలి. కావాలంటే నువ్వెళ్ళి రా. డ్రైవరున్నాడు" అన్నారు.

"డ్రైవరున్నాడుగా. మీరు హాయిగా వెనుక సీట్లో జేరబడి రెస్టు తీసుకోండి. మీరు లేకుండా వెళ్ళే విషయం కాదు" అన్నాను అనునయంగా.

ఆయన మెత్తబడ్డారు. ఆయన సంగతి నాకు బాగా తెలును.


వెళ్ళి అర్జెంటుగా ఫిల్టరు కాఫీ తెచ్చి ఇచ్చేను.

కాఫీ తాగాక ఇద్దరం ఆయన వచ్చిన కారులోనే వనస్థలిపురం బయల్దేరేం.

ఎక్కడ చూసినా ఒకటే జనం, వాహనాల ప్రవాహం. ట్రాఫిక్ అవరోధాల్ని అధిగమించి సుజాత వాళ్ళిల్లు చేరేసరికి తల ప్రాణం తోకకొచ్చినట్లయింది.

"ఇంతకంటే విజయవాడ రైల్లో వెళ్ళుంటే సుఖంగా చేరిపోయేవాళ్ళం" అన్నారాయన.

"అవునవును. మనం మొదట ఈ ఊరొచ్చినప్పుడు ఎంత ప్రశాంతంగా, అందంగా ఉండేదీ ఊరు! ఇప్పుడు కాంక్రీట్ జంగిలయిపోయింది"



చిత్రాలు: నర్సిం

అన్నాను కారు దిగుతూ.

ఇద్దరం గేటు తీసుకొని లోనికి ప్రవేశిస్తుంటే ట్యూబుతో మొక్కలకి నీళ్ళు పెడుతున్న శ్రీనివాస రావుగారు మమ్మల్ని చూసి గుర్తుపట్టి నవ్వుతూ, "రండి రండి, బహుకాల దర్శనం" అన్నారు ట్యూబు మొక్కల్లోకి గిరాటేసి.

ఇద్దరం ఆయన్ననుసరించేం.

ఇంటి వాతావరణంలో చాలా మార్పు కనబడుతోంది.

ఇంటిముందు తోట పచ్చగా కళకళలాడుతోంది. చాలా కొత్త మొక్కలేసేరు. డ్రాయింగ్ రూమ్‌లో అదివరకున్న సోఫా సెట్స్, కార్నర్ రేక్స్ - వాటిలో ఖరీదైన బొమ్మలు ఏవీలేవు.

నాలుగు ఫైబర్ చెయిర్స్ ఓ మూలకి పెట్టి ఉన్నాయి. ఒక కలర్ పోర్టబుల్ టీవీ మాత్రముంది.

శ్రీనివాసరావుగారు చెయిర్స్ వేస్తూ, "సుజా, ఎవరొచ్చేరో చూడు" అన్నారు.

సుజాత లోపల్నుంచి వచ్చింది. ఆమె చేతిలోని ఆరునెలల పాప ఆమె జుట్టు పీకుతూ కేరింతలు కొడుతోంది.

ప్రియ చెప్పిన విషయం రూఢి అయింది.

"అబ్బో, చాలాకాలానికి దారితప్పినట్టున్నారు" అంది సుజాత నవ్వుతూ.

"అవును. నువ్వేదీ తప్పలేదుగా" అన్నాను జవాబుగా.

"నీతో మాటలతో గెలవడం సాధ్యం కాదులే! అన్నయ్యగారూ బాగున్నారా" అంది మావారి వైపు తిరిగి.

ఆయన తల పంకించి, "చాలా అర్జెంటని లాక్కొచ్చింది. విషయమేంటో కనుక్కోండి" అన్నారు.

సుజాత నా వైపు చూసింది.

"మాటలు తర్వాత, ముందెళ్ళి ఏవన్నా తీసుకురా. చాలా దూరం నుండొచ్చేరు" అంటూ పాపని తీసుకున్నారు శ్రీనివాసరావుగారు.

సుజాత లోపలికి వెళ్ళింది.

"ఎవరీ పాప? మనుమరాలా" అనడిగేను శ్రీనివాసరావుగారిని.

"ఊఁహూఁ" అన్నారాయన ముక్తసరిగా.

"ఏవిటీ, ఇద్దరూ ఒక్కసారే రిటైర్‌మెంటు తీసేసుకున్నారట. ఎందుకని" అన్నాను.

ఈ విషయాలేం తెలియని మావారు నా ప్రశ్నల్ని వింతగా ఆలకిస్తున్నారు.

"విశేషమేమీ లేదు. ఇంకవసరం లేదని."

శ్రీనివాసరావుగారు జవాబు చెబుతుండగానే కాసిని బిస్కట్లు, టీ తీసుకుని సుజాత వచ్చింది.

వస్తూనే, "ఏంటి చాలా సంగతులు తెలుసుకునే వచ్చినట్లున్నావు" అంది టీ అందిస్తూ.

"అవును. ఇద్దరూ ఒక్కసారే వాలంట్రీ రిటైర్‌మెంటు తీసుకున్నారని ప్రియ చెప్పింది. మీ ఆరోగ్యం ఎలా ఉందోనని..."

ప్రియ పేరు వినగానే వాళ్ళిద్దరి మొహాలు గంభీరంగా మారేయి.

"ప్రియ ఫోను చేసిందా" అనడిగేరు శ్రీనివాస రావుగారు.

"అవును" అన్నాను.

"ఇంకా ఏం చెప్పింది. దీన్ని పెంచుతున్నామని చెప్పలేదూ" అంది సుజాత పాపని ముద్దు పెట్టుకుంటూ.

"చెప్పింది. ఈ వయసులో దేనికీ శ్రమ అంది. నా ఉద్దేశం కూడా అదే" అన్నాను.

"నాకేం అర్థం కావడం లేదు" అన్నారు మా వారు మా ఇద్దరికేసి చూస్తూ.

"రండి. మనిద్దరం హాల్లో కూర్చుని మాట్లాడు కుందాం" అంటూ శ్రీనివాసరావుగారు మా వారిని హాల్లోకి తీసుకెళ్ళేరు.

"నువ్వు రాగానే అనుకున్నా. పిల్లలు ఫోను చేసి ఉంటారని. సిద్ధార్థ కూడా చేసి ఉంటాడే" అంది సుజాత పాపకి పాలుపడుతూ.

సుజాత ఆ వయసులో పడుతున్న అవస్థ చూసి నాకు నవ్వాలో, ఏడవాలో తెలియడం లేదు. సుజాతకి యాభై సంవత్సరాలుంటాయి. ఇంకా ఎనిమిది సంవత్సరాల సర్వీసుంది. శ్రీనివాసరావుగారికయితే ఇంకా నాలుగేళ్ళు- ఇద్దరూ ఆరోగ్యంగానే ఉండి ఉద్యోగాలు వదిలేసేరంటే...

వాళ్ళిద్దరి మనస్తత్వం నాకర్థం కావడం లేదు.

సుజాత పాపని జోకొట్టి నిద్రపుచ్చి దివాను మీద పడుకోబెట్టింది.

"ఈ పూట మీరిద్దరూ ఇక్కడే భోంచేసి వెళ్ళాలి" అంటూ నేనెంత వద్దని వారించినా వినకుండా వంటగది వైపు నడిచింది సుజాత.

నేను అనుసరించి తాను కనపడే విధంగా డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాను.

డైనింగ్ టేబుల్ పాతది మార్చేసి చిన్నది స్టీలుది తీసుకున్నారు.

"చాలా మార్పులు చేసేరు" అన్నాను ఎదురుగా అలమరలోని గ్రైప్ వాటర్, ఆముదం, ఎబ్‌డెక్ డ్రాప్స్ వగైరా పసిపాప సరంజామాని చూస్తూ.

"అవును. పిల్లలంతా వెళ్ళిపోయారుగా. మా ఇద్దరి ప్రాణాలకీ అంత అట్టహాసం దేనికి? చాకిరీ చేయలేముగా" అంది సుజాత నా ఎదురుగా కూర్చుని అరటికాయ ముక్కలు తరిగి నీటిలో పడేస్తూ.

"చేయలేమంటూ పెద్ద భారమే ఎత్తుకున్నారుగా. అన్నయ్యగారు తోటపని చేస్తున్నారు. నువ్వేమో చంటి పాపనే పెంచేస్తున్నావు" అన్నాను.

సుజాత మళ్ళీ నవ్వి, "చల్లకొచ్చి ముంత దాచినట్లు నువ్వు పిల్లల తరపున వకాల్తా పుచ్చుకొని వచ్చేవు కదూ" అంది.

నేను కూడా సూటిగా రంగంలో దిగేను.

"అవును సుజా! వాళ్ళకి నా దగ్గర చనువున్న సంగతి నీకు తెలుసుగా. నువ్విలా ఒక అనాథ పాపని పెంచడం వాళ్ళకెంత మాత్రం ఇష్టం లేదు. ముగ్గురి పిల్లల్ని పెంచేవు. పెంచడంలో అలా ఇలా

కాదు. నువ్వు ప్రతి క్షణం వాళ్ళ కోసం తీసుకున్న శ్రమ, వాళ్ళకి మంచి స్థాయి ఇవ్వడం కోసం చేసిన కృషి నాకు తెలియంది కాదు. ఇప్పుడిక మళ్ళీ ఈ శ్రమ దేనికి? పైగా ఈ వయసులో! ఈ మాటలు నావి కావు, నీ పిల్లలవి" అన్నాను.

మళ్ళీ అదే నవ్వు.

"ఒక అనాథ పాపని పెంచడానికి మాత్రం మాకు వయసయిపోయింది. రిటైర్‌మెంటు తీసుకోవడానికి మాత్రం వయసు అయిపోలేదు" అంది నిష్ఠురంగా.

"ఐ మీన్ గవర్నమెంటు రూల్స్ ప్రకారం ఉంది కదా" అన్నాను.

"మనం ఉద్యోగాల్లో చేరేటప్పుడు మన వయసెంత. ఇరవై. ఇప్పుడు యాభై. ఏకధాటిన మనం మన కుటుంబం కోసం ముప్ఫయ్ సంవత్సరాలు పని చేసేం. అప్పుడు క్రెష్‌లు లేవు. మెటర్నిటీ లీవు రెండు నెలలే. క్యాజువల్ లీవులు పదే. పదిన్నరకు వెనక వెళ్ళినా, అయిదు గంటలకి ముందెళ్ళినా మెమోలు, ఎక్స్‌ప్లనేషన్సే. అయినా, కష్టపడి పని చేసేం. ప్రమోషన్స్ పొందేం. ప్రతి పైసా పిల్లల బాగు కోసం ఉపయోగించేం. మన తల్లితండ్రుల దగ్గర మనం పొందిన నిరాదరణ మన పిల్లలు పొందకూడదని కంటికి రెప్పల్లా పెంచేం. నీకు గుర్తుందా, మనిద్దరం మన మొదటి జీతంలో తొంభై రూపాయలు పెట్టి కేమీ వాచీలు భయపడుతూ కొనుక్కోవడం. కానీ, వీళ్ళకి టైటాన్ వాచీలు, కాలిక్యులేటర్స్, కెనెటిక్ హోండాలు, కలర్ టీవీలు, ఎవరి గదులు వాళ్ళకి, పాకెట్ మనీలు– ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే మన పిల్లలు మనకన్నా చాలా ఉన్నత స్థాయిలో పెరిగేరు. అవునా?"

నేను తల పంకించేను. సుజాత ఏం చెప్పబోతున్నదో నాకర్థం కావడం లేదు.

సుజాత లేచి అరటికాయ ముక్కలు వేయిస్తూ మళ్ళీ చెప్పసాగింది.

పిల్లల్ని అరచేతుల మీద పెంచడం అంటారే, అలా పెంచేను నేను. అందరూ మంచి హోదాలకే వెళ్ళేరు. ఇల్లు కట్టుకున్నాం. కారు కొనుక్కున్నాం. ఇప్పుడింకా పరుగులెత్తి సంపాదించాల్సిన అవసరం ఉందా" అంటూ నా వైపు తిరిగింది.

"అవసరం అంటే. ఈ కరవు రోజుల్లో..." అంటూ నసిగేను నేను.

"నువ్వు కూడా అవకాశవాదంగా మాట్లాడకు. ఏ సంవత్సరానికా సంవత్సరం కరవే. మొన్న వచ్చిన ఆదాయానికి మొన్నటి వ్యయం ఎక్కువ. నిన్నటిది నిన్నటికి, నేటిది నేటికి. మనం చేరినప్పుడు వంద రూపాయలు బేసిక్. ఇప్పుడో పదహారువేలు. బాధ్యతలున్న వాళ్ళు పూర్తి సర్వీను చేయడం సమంజసమే. కానీ, అవి తీరేక పడుతూ లేస్తూ ఆఫీసులకి వెళ్ళాలంటావా?"

సుజాత ప్రశ్నకి నేను జవాబు చెప్పలేక పోయేను.

"మనం రిటైరయితే మరొకరికా ప్రమోషన్ వస్తుంది. ఇదేదో ఔదార్యం, త్యాగం కాదు. సక్సెస్‌ఫుల్‌గా సర్వీసు చేసి, గౌరవంగా చార్జి హేండోవర్ చేసి ఇంటికెళ్ళకుండా సర్వీసు పొడుగింపు కోసం అర్రులు చాస్తూ ఆఖరి నిమిషం వరకు సెక్రటేరియట్‌కి పరుగులెత్తే బడా బడా ఆఫీసర్స్‌ని చూస్తే నాకు చాలా ఏవగింపు. మనిషికి తృప్తి ఉండాలి. ఏమంటావు?"

"నీకింకా ఎనిమిదేళ్ళ సర్వీసుందిగా!"


"చెప్పేనుగా. చెయ్యాల్సిన అవసరం లేదని."

"అద్సరే. మరీ అనాథ పాప బాధ్యతెందు కిప్పుడు?"

"ఇప్పుడు దానికి మేం తల్లితండ్రులం. అది అనాథ కాదు." నవ్వుతూ చెప్పినా చాలా స్థిరంగా ఉంది సుజాత జవాబు.

"మీకు ఓపిక ఉండి కాలక్షేపం కావాలంటే ప్రియ కూతురుంది. సిద్ధార్థ కొడుకున్నాడు."

**"ఇక్కడో స్వార్థముంది. మాకో వ్యాపకం కావాలి. ఇదివరకు మా బిడ్డల్ని పెంచడం స్వార్థమయితే, ఇప్పుడీ బిడ్డని పెంచడం నిస్వార్థం. మా మనసుకు కావాల్సిన ఆనందం పొందడం స్వార్థం."**



"అది నాకిష్టం లేదు. ఈ హైటెక్ పిల్లలకి మనం చాలా వెనుకబడిన వాళ్ళం. మన చేతుల్లో పెరిగిన వీళ్ళకిప్పుడు మనం పెంచే పద్ధతులు నచ్చవు. అలా వాళ్ళ చేత దులప రించుకోవడం నా కిష్టం లేదు జయా! నీకసలు విషయం చెప్పలేదు. మేమిద్దరం స్వచ్ఛందంగా పదవీ విరమణ చేస్తామని చెప్పినప్పుడు వీళ్ళు ముగ్గురూ చెప్పిన జవాబు మమ్మల్ని నిర్వీణ్ణుల్ని చేసింది. అదేంటో తెలుసా?"

అంతవరకూ నవ్వుతూ మాట్లాడిన సుజాత అకస్మాత్తుగా ఎగ్జయిటయింది. కళ్ళు ఎర్రబడ్డాయి.

"ప్లీజ్ కూల్ డౌన్ సుజీ" అన్నాను అనునయంగా.

"ఫర్వాలేదు. 'మొన్ననే పే రివిజన్‌లో జీతాలు చాలా పెరిగేయి కదా, ఇప్పుడే సంపాదించడానికి వీలు. మీకా పెద్ద వయసు. తినలేరు, తిరగలేరు. ఇలాంటప్పుడు రిటైర్‌మెంట్ తీసు కోవడం ఫూలిష్‌నెస్. ఇంట్లో మాత్రం ఏం తోస్తుంది అని' మేం చేస్తామో, మానేస్తామో అది వేరే విషయం. ఇన్నాళ్ళూ సర్వీసు చేసి మా కోసం 'కష్టపడి అలసిపోయేరు. ఇంక మానేసి మా దగ్గరకొచ్చేసి మనుమలతో ఆడు కోండి' అంటే మాకు చాలా ఆనందం కలిగేది. కానీ, వాళ్ళలా అనలేదు. వాళ్ళు రమ్మనగానే మేం వెళ్ళిపోం. అమెరికా వెళ్ళి డాలర్లు సంపాదిస్తున్నా, అమ్మా నాన్న సంపాదన మీద వాళ్ళకు ఆశ ఉండడం మేం భరించలేకపోయాం. అందుకే ఇలా నిర్ణయించుకున్నాం" అంది సుజాత ఆవేశంగా.

పిల్లలావిధంగా మాట్లాడినందుకు నేనూ ఆశ్చర్యపోయేను.

మన పిల్లలు మనకంటే మంచి స్థితిలో ఉండాలని ఆశపడి వారిని మనకే అందనంత ఎత్తుకి మనమే ఎగరేస్తున్నామా!

"అది సరే! ఇప్పుడీ అదనపు బాధ్యత దేనికి? ఈ బిడ్డ మాత్రం రేపలా చేయదంటావా?" అడిగేను నేను.

"ఇక్కడ మాకో స్వార్థముంది. మాకో వ్యాపకం కావాలి. ఇదివరకు మా బిడ్డల్ని పెంచడం స్వార్థమయితే ఇప్పుడీ బిడ్డని పెంచడం నిస్వార్థం. మా మనసుకు కావాల్సిన ఆనందం పొందడం స్వార్థం. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. మా పిల్లల్ని పెంచడంలో చేసిన తప్పులు ఇప్పుడు చేయం. ఇప్పుడిక మిగతా జీవితం మా కోసమే."

"అయ్యోయా కబుర్లు. వడ్డిస్తావా" అంటూ లోనికొచ్చేరు శ్రీనివాసరావుగారు.

"ఆఁ ఆఁ మీదే ఆలస్యం" అంటూ ప్లేట్లు సర్దింది.

"కరివేపాకు పొడి, ఆవకాయ, అరటికాయ వేపుడు, సాంబారు, గడ్డపెరుగు - అమృతంలా ఉంది సుజాత పెట్టిన భోజనం.

భోజనాలు ముగించేసరికి పాప లేచింది.

సుజాత పాపనెత్తుకుని కారుదాక వచ్చింది.

"పాపకేం పేరు పెట్టేవు" అన్నాను పాప బుగ్గలు పుణుకుతూ.

"ఆర్ద్రత."

"బాగుంది. అదే ఇప్పటి హైటెక్ బేబీలకి లోపిస్తోంది" అన్నాను కారెక్కుతూ.

"జీవితాన్ని తిరిగి చైతన్యవంతంగా మార్చుకుని ఓడిపోకుండా బతుకుతున్న సుజాత దంపతుల పట్ల నాకు చెప్పలేని గౌరవం పెరిగింది. ■